దుకాణాలు తెరవొద్దు

మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్, సిఐ సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆకివీడు

సార్వత్రిక ఎన్నికల ఫలితాల కౌంటింగ్ నేపథ్యంలో పట్టణంలోని దుకాణాలు మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్, సిఐ వైఎన్‌వి.సత్యనారాయణ వ్యాపారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే ఈ ప్రకటన చేస్తున్నామని వారు చెప్పారు. అయితే సాధారణ ప్రజానీకానికి, జనజీవన క్రియలకు అడ్డం లేకుండా చిన్నచిన్న వ్యాపారాలు సాగించుకోవచ్చన్నారు. ఉదయం 9 గంటల్లోపు అన్ని రకాల సాధారణ అవసరాలు కాఫీ, టిఫిన్ సెంటర్లు అమ్మకాలు పూర్తి చేసుకుని కట్టివేయాలని వారు సూచించారు. ఆ తర్వాత దుకాణాలు పూర్తిగా మూసివేయాలని చెప్పారు.

లెక్క తేలేది నేడే..

- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- తొలుత పోస్టల్ బ్యాలెట్, తర్వాత ఇవిఎం ఓట్ల లెక్కింపు
- రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు
- పోలైన ఓట్లు 'పశ్చిమ'లో 12,16,667, ఏలూరు జిల్లాలో 13,69,862
- ప్రధాన పార్టీల నేతల్లో ఎడతెగని ఉత్కంఠ
- కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు

కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2024 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ చివరి ఘట్టానికి చేరుకుంది. ఓటర్ల తుది తీర్పు మంగళవారం వెల్లడి కానుంది. కౌంటింగ్ ప్రక్రియపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నువ్వా.. నేనా అన్నట్లు సాగిన ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో తేలడానికి కొన్నిగంటల వ్యవధి మాత్రమే ఉంది. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. అప్పటి నుంచి జిల్లాలో ఆయా పార్టీల అభ్యర్థుల ఎంపిక, మార్పులు, చేర్పులు వంటి ఎన్నో అంశాలు ఉత్కంఠ రేపాయి. ఉండి నియోజకవర్గంలో టిడిపి తన అభ్యర్థిని ప్రకటించిన తర్వాత సైతం చివరి నిమిషంలో మార్చిన పరిస్థితులు ఉన్నాయి. దెందులూరు వంటి చోట్ల నామినేషన్ల ఘట్టం వరకూ అభ్యర్థి ఎవరనే దానిపై టిడిపిలో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ప్రచారంలోనూ ప్రధాన పార్టీలన్నీ నువ్వానేనా అన్నట్లు పోటీపడ్డాయి. జగన్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వంటి అగ్రనేతలు జిల్లాను చుట్టేశారు. ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానానికి, పశ్చిమలో ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానానికి ఎన్నికల ప్రక్రియ సాగింది. రెండు జిల్లాల్లో మొత్తం 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలకు మే 13న జరిగిన ఎన్నికల్లో నువ్వానేనా అన్నట్లు ఇరుపార్టీల అభ్యర్థులు పోటీపడ్డారు. పోలింగ్‌లో ఏలూరు జిల్లాలో మొత్తం 16,37,430 మంది ఓటర్లు ఉండగా 13,69,862 మంది 83.65 శాతం తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఏలూరు నియోజకవర్గం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లోనూ 80 శాతం ఓటింగ్ దాటిన పరిస్థితి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో 14,72,923 మంది ఓటర్లు ఉండగా మే 13న జరిగిన ఎన్నికల్లో 12,16,667 మంది 82.60 శాతం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్‌శాతం పెరగడంతో ప్రజలు ఎటువైపు మొగ్గుచూపారనే ఉత్కంఠ ఇరుపార్టీల్లోనూ నెలకొంది. పోలింగ్ తర్వాత రెండు జిల్లాల్లోనూ భారీగా పందేలు సాగాయి. గెలుపోటములు, మెజార్టీపైనా, మండలాలు, గ్రామాలవారీగా మెజార్టీలపైనా పందేలు సాగాయి. జూన్ ఒకటో తేదీ సాయంత్రం వివిధ సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయడంతో ఇరుపార్టీల నాయకుల్లో మరింత టెన్షన్ నెలకొంది.

కౌంటింగ్ ప్రక్రియ సాగేదిలా

పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించిన ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానానికి సంబంధించి ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, విష్ణు కాలేజీల్లోనూ, ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానానికి సంబంధించి సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలోనూ కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. ఆ సమయంలోపే కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు అక్కడకు చేరుకుంటారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఏలూరు జిల్లాలో 17,500, పశ్చిమగోదావరిలో 13,345 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్లు లెక్కింపు ప్రారంభించి, అనంతరం ఇవిఎంల్లో ఓట్లను లెక్కిస్తారు. ఆయా నియోజకవర్గాల్లో పోలైన ఓట్లను బట్టి 13 రౌండ్ల నుంచి 21 రౌండ్లలోపు పూర్తిస్థాయి ఫలితాలు వెలువరించనున్నారు. ప్రతి రౌండ్‌కూ ఆ నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులకు వచ్చిన ఓట్లను వెల్లడిస్తారు. లెక్కింపు పూర్తయిన తర్వాత తుదిఫలితం వెల్లడించి గెలిచిన అభ్యర్థికి ధ్రువీకరణపత్రం అందిస్తారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఇప్పటికే పోలీసులు అనేక చర్యలు చేపట్టారు. మద్యం షాపులు మూడు రోజులపాటు మూసివేస్తున్నారు. బాణాసంచా కాల్చకుండా ఆదేశాలిచ్చారు. కౌంటింగ్ రోజు ఏలూరు, భీమవరం ప్రాంతాల్లో వ్యాపార దుకాణాల మూసివేతకు చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యి అంతా సర్దుకునే వరకూ పోలీస్ ఆంక్షలు కొనసాగనున్నాయి.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియపై ఎఆర్ఒలు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు భీమవరం విష్ణు కాలేజీ లైబ్రరీ హాల్ వద్ద సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బ్యాలెట్ లెక్కింపుపై సంబంధిత అధికారులకు ఏవిధమైన అవగాహన ఉందో తెలుసుకునేందుకు వారి వద్దకు వెళ్లి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ ద్వారా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకొని 4వ తేదీన కౌంటింగ్ ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో ఫారం - 13సి, ఫారం - 13ఎ, ఫారం - 13బిలకు సంబంధించిన అంశాలను పేర్కొన్నారు. వాటిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే సర్వీస్ ఓటర్లకు సంబంధించి బ్యాలెట్ల లెక్కింపులో పూర్తి జాగ్రత్త వహించి మార్గదర్శకాలకు అనుగుణంగా లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎలాంటి సొంత ఆలోచనలకు తావివ్వకుండా ఎన్నికల నిబంధనలను విధిగా పాటించి ఓట్ల లెక్కింపు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు, ఎన్నికల సెక్షన్ పర్యవేక్షకులు చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ మద్రాపు సన్యాసిరావు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో విజయం సాధిస్తా

జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మెజార్టీ సాధిస్తానని జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ కూటమికి మద్దతుగా దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు సైతం ఎన్నికల రోజు వచ్చి ఓట్లు వేశారన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అన్ని రకాల వర్గాల మద్దతు కూటమికి ఉందన్నారు. కూటమి గెలుపు ప్రజా గెలుపు అన్నారు. తన హయాంలో వశిష్ట గోదావరిపై బ్రిడ్జి నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. జూన్ 4వ తేదీన ప్రజా తీర్పు రాబోతోందన్నారు. విజయం కోసం కూటమి నాయకులతోపాటు, కార్యకర్తలు రాత్రీపగలు ఎంతో కృషి చేశారన్నారు. గతంలో కంటే ఓటింగ్ శాతం పెరిగిందని, అన్ని ఓట్లూ కూటమికి పడతాయన్నారు. ప్రజాతీర్పులో ప్రజలందరూ కూటమికి మద్దతు ఇచ్చారని తెలిపారు. నరసాపురంలో జనసేన పక్కా అన్నారు.

తొలి ఫలితం నరసాపురానిదే..!

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్రంలో తొలి ఎన్నికల ఫలితం జిల్లాలోని నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వెలువడే అవకాశం ఉంది. రాష్ట్రంలో అతి తక్కువ ఓట్లు ఉన్న నియోజకవర్గం కావడంతో అవకాశాలు మెండుగా ఉన్నాయి. నియోజకవర్గంలో 1,70,448 ఓట్లు ఉన్నాయి. మే 13న సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 84.38 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం 1,70,448 ఓటర్లకు గాను 1,43,825 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓట్లు వేసిన వారిలో 72,598 మంది పురుషులు, 71,227 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో 84.38 శాతం పెరిగింది. భీమవరం విష్ణు కాలేజీలో జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో అంతా సవ్యంగా జరిగితే మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల్లోపు ఫలితాలు వెలువడనున్నాయి. ఉదయం 8 గంటలకు సర్వీస్ ఓట్లు, పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓట్లు కౌంటింగ్ జరుగుతుంది. 8.30 నిమిషాలకు ఇవిఎంలను లెక్కిస్తారు. 169 బూత్‌లకు 12 రౌండ్లలో 14 ఇవిఎం టేబుల్స్, 4 పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్‌పై 56 మంది సిబ్బందితో ఓట్లు లెక్కించనున్నారు. ఒక్క రౌండ్‌కు 14 ఇవిఎంలు లెక్కిస్తారు. అలా లెక్కిస్తే చివరకు ఒక్క ఇవిఎం మిగులుతుంది. దానికోసం అదనంగా ఒక్క రౌండ్ మొత్తం 13 రౌండ్‌లో కౌంటింగ్ జరుగుతుంది. అంతా సవ్యంగా జరిగితే ఒక్కో రౌండ్‌కు 30 నిమిషాలు పట్టనుంది. ఎప్పటికప్పుడు సువిధ యాప్‌లో ఫలితాలు అధికారులు అప్‌లోడ్ చేస్తారు.

జోరుగా బెట్టింగులు..!

ప్రజాశక్తి - నరసాపురం

నియోజవర్గంలో ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ జోరుగా సాగుతోంది. ఇప్పటి వరకూ ఒక విధంగా జరిగిన బెట్టింగ్ చివరి రోజు భారీగా పెరిగింది. మెజార్టీ, రాష్ట్రంలో సీట్లు, నరసాపురం, పిఠాపురం సీట్లపై బెట్టింగ్ ఎక్కువ జరుగుతోంది. రూ. లక్షకు రూ.5 లక్షల బెట్టింగ్ జరుగుతోంది. ఇప్పటికే కోట్లల్లో బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. చాలాచోట్ల పందేలు కాసేందుకు ఎగబడుతున్నా అవతల వ్యక్తులు ఆసక్తి చూపడం లేదు. పలువురు మంత్రులు, రాజకీయ పార్టీ ముఖ్య నేతలు పోటీ చేసిన చోట్ల, జిల్లాల వారీగా ఎక్కువగా బెట్టింగ్ సాగుతోంది.

పింఛన్ పాట్లు..!

బ్యాంకుల వద్ద వృద్ధుల పడిగాపులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి నెలా ఇంటి వద్దే పింఛను అందుకోవడానికి అలవాటు పడ్డ వృద్ధులు, వితంతువులు బ్యాంకుల వద్ద అవస్థలు పడుతున్నారు. మండలంలోని 5,802 మంది లబ్ధిదారులకు పెన్షన్ కోటీ 7 లక్షల రూపాయలు వారి బ్యాంకు ఖాతాలకు జమయ్యాయి. అవి తీసుకోవడానికి పలువురు వృద్ధులు, వితంతువులు సోమవారం ఉదయం మార్టేరు, పెనుమంట్ర, ఆలమూరు, పొలమూరు బ్యాంకుల వద్ద కనిపించారు.

నరసాపురం : పింఛన్ కోసం సోమవారం పెద్ద ఎత్తున వృద్ధులు బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. పట్టణ, మండలంలో ఏ బ్యాంకుల వద్ద చూసినా బ్యాంకులు కిటకిటలాడాయి. జూన్‌కు సంబంధించి పింఛన్ సొమ్ము డిబిటి ద్వారా బ్యాంకు ఖాతాలో జమచేశారు. జూన్ 1న వర్షం పడడం, 2న ఆదివారం కావడం, 3న సోమవారం కావడంతో పింఛను కోసం వృద్ధులు ఉదయం నుంచే వృద్ధులు బ్యాంకుల వద్ద పడిగాపులు పడుతున్నారు. నాలుగో తేదీన కూడా సెలవు కావడంతో పెద్ద ఎత్తున బ్యాంకుల వద్ద ఖాతాదారులు రద్దీ ఏర్పడింది.

పెనుమంట్రలో బ్యాంకు వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు

గణపవరంలో బ్యాంకు వద్ద వృద్ధుల నిరీక్షణ

గణపవరం : అర్ధవరం సెంట్రల్ బ్యాంకు వద్ద సోమవారం పింఛను కోసం వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో వృద్ధులు, వికలాంగులకు ప్రభుత్వం నుండి రావాల్సిన పెన్షన్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. అయితే పింఛను తీసుకోవడానికి వృద్ధులు, వికలాంగులు అధిక సంఖ్యలో స్థానిక సెంట్రల్ బ్యాంకు వద్దకు చేరుకున్నప్పటికీ బ్యాంకు అధికారులు ఉదయం 11 గంటల వరకూ పెన్షన్లు అందజేయలేదు. దీంతో బ్యాంకు గేటు బయట వృద్ధులు పడిగాపులు పడ్డారు. స్థానిక పెద్దలు పి.సీతారామరాజు బ్యాంకు అధికారులతో మాట్లాడినప్పటికీ పట్టించుకోలేదని చెబుతున్నారు. వృద్ధులు పడుతున్న ఇబ్బందులను స్థానిక ఎంపిడిఒ, తహశీల్దార్‌కు చెప్పాలని, ఫోన్ చేసినా అధికారులు అందుబాటులో లేకుండా పోయారని సీతారామరాజు అన్నారు. రెండు రోజులుగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ పైఅధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు పింఛను త్వరతగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

నరసాపురంలో బ్యాంకు వద్ద వృద్ధులు

పొర లేచిపోయిన వీరవాసరం - మత్స్యపురి ఆర్అండ్‌బి రోడ్డు

యథేచ్ఛగా మట్టి రవాణా.. రోడ్డుకు తూట్లు!

అధ్వానంగా వీరవాసరం - మత్స్యపురి రోడ్డు - ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - వీరవాసరం

నెలలు గడవక ముందే రూ.ఆరు కోట్లతో అభివృద్ధి చేసిన వీరవాసరం - మత్స్యపురి ఆర్అండ్‌బి రోడ్డుకు తూట్లు పడ్డాయి. భారీ వాహనాలతో ఈ రోడ్డు గుండా మట్టిని తరలించడంతో అనేక చోట్ల రోడ్డుకు గుంతలు ఏర్పడ్డాయి. దీనికి ఎవరు బాధ్యులంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం ఈ మార్గం గుండా మట్టి రవాణా అడ్డూ అదుపూ లేకుండా సాగింది. ఆరు టన్నుల సామర్థ్యం గల భారీ టిప్పర్లు, మరోపక్క ట్రాక్టర్లతో స్థానిక అధికారులు ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవడంతో ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు మట్టిని యథేచ్ఛంగా తరలించారు. దీంతో వీరవాసరం, తలతాడితిప్ప ప్రాంతాల్లో తారురోడ్డుపై పొర లేచిపోతోంది. ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా మట్టిని పరిమితికి మించి లోడు వేయడంతో లారీలపై నుంచి జారి పడి రోడ్డుకు అతుక్కుపోతోంది. అతుక్కుపోయిన మట్టి లారీ చక్రాలతో పైకి లేచిపోవడం దాంతో పాటు తారు రోడ్డుపై పొర కూడా లేచిపోతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు వెంబడి అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. సుమారు పది సంవత్సరాల తరువాత భీమవరం ఎంఎల్‌ఎ చొరవతో ఈ రోడ్డును ఇటీవలే అభివృద్ధి చేశారు. గతంలో ఏ నాయకుడూ దృష్టి పెట్టలేని విధంగా శ్రీనివాస్ సుమారు ఏడు కిలోమీటర్ల మేర మార్గాన్ని మత్స్యపురి, బొబ్బనపల్లి గ్రామాల వద్ద సీసీ రోడ్డు, మిగిలిన ప్రాంతాల్లో తారురోడ్డు వేశారు. ఎంతో పటిష్టంగా అభివృద్ధి చేసిన ఈ రోడ్డు మట్టి రవాణాతో తూట్లు పడ్డాయి. అనతి కాలంలోనే ఈ మార్గానికి ఈ దుస్థితి ఏర్పడడం వల్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భీమవరంలో కౌంటింగ్ ఆంక్షలు కట్టుదిట్టం

దుకాణాలు మూసివేత.. ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కౌంటింగ్ సందర్భంగా భీమవరంలో మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలతోపాటు మళ్లింపు అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పి అజిత వేజెండ్ల తెలిపారు. నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లో మాత్రమే పోటీ అభ్యర్థులు, కౌంటింగు ఏజెంట్ల వాహనాలు పార్కింగ్ చేయాలని సూచించారు. భీమవరం పట్టణ, పరిసర ప్రాంత గ్రామ ప్రజలు గమనించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కౌంటింగ్ సందర్భంగా భీమవరంలో దుకాణాలన్నీ మూసివేయనున్నారు. కౌంటింగ్ కేంద్రాలకు మూడు కిలోమీటర్ల పరిధిలో కట్టుదిట్టమైన పోలీస్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఆయా కేంద్రాల పరిధిలో నోఫ్లయ్ జోన్‌గా పోలీసులు ఇప్పటికే ప్రకటించారు.

వాహనాలు నిలుపు స్థలాలు

ఆచంట, తణుకు నియోజకవర్గం నుండి వచ్చే వారు విష్ణు క్యాంపస్ దగ్గరలో ఉన్న అంజన, సంజన అపార్టుమెంట్ వద్ద పార్కింగ్ చేయాలి. నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గం నుండి వచ్చే వారు కొవ్వాడ అన్నవరం రోడ్డు మీదుగా విష్ణు ప్లేగ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి. భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుండి వచ్చే వారు నాగరాజు మాల్ వద్ద పార్కింగ్ చేసుకోవాలి. ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుండి వచ్చే వారు కాళ్ల రోడ్డులోని శ్రీరామ కోల్డ్ స్టోరేజీ వద్ద పార్కింగ్ చేసుకోవాలి.

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్‌పి అజిత వెజెండ్ల

యువతుల రక్షణకు చర్యలు చేపట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వాలు విద్యావకాశాల్లో యువతులను మెరుగుపర్చి, రక్షణ కల్పించడం ప్రథమంగా చేపట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. సోమవారం చివరి రోజు ఐద్వా శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో రాబోయే రోజుల్లో కొత్త ప్రభుత్వాలు కొలువు తీరనున్నాయి. ప్రేమ పెళ్లి పేరుతో యువతులపై దాడులు దారుణంగా పెరిగాయని, ఏలూరులో ఇటీవల జరిగిన ప్రేమ ఉన్మాది ఘాతుకాన్ని తీవ్రంగా ఖండించామని తెలిపారు. యువతలు, మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. వీరికి రక్షణ కల్పించేందుకు యువకులను తప్పుదారి పట్టిస్తున్న లైంగిక, అసభ్యకర వీడియోలను, మత్తు పదార్థాలను, మద్యాన్ని ప్రభుత్వం అరికట్టాలన్నారు. లైంగిక వేధింపు కేసుల్లో నిందితులకు తక్షణం శిక్షలుపడేలా ప్రభుత్వాలు చూడాలన్నారు. లైంగిక వేధింపుల కేసులో తక్షణం విచారణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక విద్యలో 3, 4, 5 తరగతులను వేరు చేయడంతో ఆడపిల్లలు పెద్ద ఎత్తున ప్రాథమిక విద్యకు దూరం అయ్యారన్నారు. దీన్ని ప్రభుత్వం చక్కదిద్దాలన్నారు. బాలురతో పోటీ పడుతున్న బాలికలు ఉన్నత విద్యనభ్యసించడానికి అవకాశాలు మెరుగుపర్చాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై రానున్న కాలంలో అన్ని జిల్లాల్లో కార్యక్రమాలు చేపట్టి వారిని ఐక్యం చేసేందుకు పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సెక్రటరీ పొగాకు పూర్ణ, అధ్యక్షురాలు కేతా పద్మజ, ఎస్.ఉదయ్‌కుమారి, ఎస్‌జె.ప్రభ, బి.శ్యామల, హేమలత, ప్రశాంతి, సరోజినీ, యశోద పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమాదేవి

భవిష్యత్తు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీదే

నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భవిష్యత్తు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ రంగానిదేనని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి సూచించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న రంగాల్లో త్రీడీ ప్రింటింగ్ రంగం ఒకటని తెలిపారు. ఈ టెక్నాలజీని ఉపయోగించి వివిధ రకాల నాణ్యమైన వస్తువులు, బొమ్మలు, భవనాలు, వంతెనలను నచ్చిన డిజైన్లలో ఎంతో అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై నైపుణ్యాలను పెంపొందించుకుని అంకుర పరిశ్రమలను ఏర్పాటుచేసే స్థాయికి ఎదగాలన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచి స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్‌మెటిక్స్) కోర్సులపై పట్టు సాధించడంతోపాటు అన్ని రంగాలపై అవగాహన పెంచుకోవాలని వివరించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్ కుమార్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.బాబూరావు మాట్లాడుతూ త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ విభిన్న రంగాల్లో కీలకపాత్ర పోషిస్తుందని, విద్యార్థులు త్రీడి ప్రింటింగ్ అప్లికేషన్లు, మెలకువలను నేర్చుకోవాలని వివరించారు. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా డాక్టర్ టి.కార్తికేయశర్మ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ పి.శంకర్‌తోపాటు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 44 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిట్ రిజిస్ట్రార్ దినేష్‌శంకర్ రెడ్డి

హక్కుల సాధనకు కృషి

సమాఖ్య కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సోడదాసి గంగయ్య

ప్రజాశక్తి - కాళ్ల

హక్కుల సాధన కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సమాఖ్య కమిటీ నిరంతరం కృషి చేస్తుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సమాఖ్య కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సోడదాసి గంగయ్య అన్నారు. సోమవారం కాళ్లకూరు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సమాఖ్య కమిటీ సమావేశాన్ని సోడదాసి గంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న జిల్లా, మండలాల్లో నూతన కమిటీలను త్వరలో నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి మండల అధ్యక్షులు కొండా రాజేష్ కుమార్, మద్రి కృపదానం, తాళ్లూరి రాజ్ కుమార్, సోడదాసి రత్నరాజు, గుర్రం వెంకటరత్నం, ఇసుక పట్ల యోబు పాల్గొన్నారు.

ఘనంగా సైకిల్ దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు

శారీరక శ్రమ తక్కువగా ఉండటం వల్ల యువకులు సైతం గుండెపోటు, ఇతర అనారోగ్యాలకు గురి అవుతున్నారని పాలకొల్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకర్ అన్నారు. అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం సందర్భంగా వాకర్స్ క్లబ్ పాలకొల్లు సహకారంతో ఒక విద్యార్థికి సైకిల్ అందించారు. గురువేడ సారథ్యంలో అధ్యక్షు కల్యాణ మండపంలో సైకిల్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్, నడక అద్భుతమైన వ్యాయామాలు అన్నారు. సైకిల్ తొక్కిన వారు 90 సంవత్సరాలైనా నేటికీ ఆరోగ్యంగా ఉండి వారి పని వారే చేసుకుంటున్నారని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి పీర్ సాహెబ్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి శిక్షణ శిబిరాలు

నరసాపురం: ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవివిజ్ఞాన శిక్షణ తరగతులు సోమవారం కొనసాగాయి. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం పిల్లల చేత నీతి కథలు చదివించారు, చెప్పించడం వారికి వినిపించడం, పుస్తక సమీక్ష, టింకిల్, మ్యాజిక్ పాట్ వంటి పిల్లల మాసపత్రికలు చదివించడం జరిగింది. చిత్రలేఖనంలో తోట శ్రీనివాస్ ఆర్టిస్ట్ శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్ జీవన్ కుమార్ క్రాఫ్ట్ వర్క్లో శిక్షణ, రంగు కాగితములతో వివిధ రకాల అందమైన పుష్పగుచ్ఛాల డెకరేషన్ ఐటమ్స్ తయారు చేశారు. టి.కృష్ణ యోగ క్లాసులు, తడపరి క్యారమ్స్, చెస్ గేమ్స్ ఆడించారు. తదనంతరం గ్రంథాలయ రోటరీ క్లబ్ వారు పాల్గొని పిల్లలకు బహుమతులు అందజేశారు. వాకర్స్ క్లబ్ మెంబర్ బి.కృష్ణమూర్తి వారి జన్మదిన సందర్భంగా పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జి.రత్నకుమార్, అసిస్టెంట్ గవర్నర్ టి.శ్రీనివాస్ బాబు పాల్గొన్నారు.

పెనుమంట్ర: మార్టేరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో సోమవారం విద్యార్థులు చిత్రలేఖనం వేసి చిత్రాలు అందరినీ అబ్బుర పరిచాయి. తొలుత విశ్రాంత తహశీల్దార్ చిర్ల సూర్యనారాయణరెడ్డి పిల్లల చేత శ్లోకాలు చెప్పించారు. విశ్రాంత ఉపాధ్యాయిని పి.సువర్ణ గౌరీ క్విజ్ పోటీలు, సంగీతం మాస్టారు ఐ.ఏసురాజు పాటల కార్యక్రమం నిర్వహించారు.

పాఠశాలల బస్సులకు ఫిట్నెస్ టెస్ట్ డ్రైవ్

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డి.సురేంద్ర సింగ్ నాయక్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీఓ కార్యాలయం వద్ద సోమవారం తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన బస్సులకు ఫిట్నెస్ టెస్ట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ సురేంద్ర సింగ్ నాయక్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మొత్తం 320 స్కూల్ బస్సులకు గాను 272 బస్సులు అన్ని విధాలుగా ఫిట్నెస్ కలిగి ఉన్నందున ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు. మిగిలిన 48 బస్సులకు మరమ్మత్తులు చేయించాలని సూచించామన్నారు. పూర్తి కండిషన్ లేకుండా స్కూల్ బస్సులు నడపడానికి వీలులేదని, కొద్ది రోజుల్లో తిరిగి పాఠశాలలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మిగిలిన బస్సులు కూడా పూర్తి స్థాయిలో మరమ్మతులు పూర్తిచేసుకుని తమ వద్ద నుంచి ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నాయక్ తెలిపారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ

పెనుమంట్ర: మండలంలోని పొలమూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ చట్టం పనులను సోమవారం జిల్లా నీటియాజమాన్య సంస్థ సహాయ పథక సంచాలకులు ఎం.సురేష్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ కూలీల హాజరు పరిశీలించి, పనులు జరగుతున్న విధానంపై కూలీలను అడిగి తెలుసుకొన్నారు. పనులకు సంబంధించి కూలీలకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఎం.బాపూజీ, స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

నరసాపురం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయభాస్కర్ కృష్ణ ప్రసాద్(బుజ్జి)అన్నారు. స్థానిక టైలర్ స్కూల్ గ్రౌండ్లో 10 రోజుల నుంచి అంజూరి నాని, చిక్కాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కానూరి బుజ్జి మాట్లాడుతూ ఇటువంటి టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో అవసరమని తెలిపారు. మొదటి బహుమతిగా నగదు రూ.30 వేలు, రెండో బహుమతిగా రూ.20 వేలు అందజేశారు. వర్ధనపు ప్రసాద్, రౌతుల శ్రీనివాస్, నరేష్, బాబి, గంటా మధు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

మొగల్తూరు: విద్యాహక్కు చట్టాన్ని ఆ శాఖ అధికారులు పటిష్టంగా అమలు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ జిల్లా ఇన్ఛార్జి నల్లి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం మొగల్తూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టం 2009ను అధికారులు పటిష్టంగా అమలు చేయాలని, నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేసే ప్రయివేటు కార్పొరేట్ స్కూళ్లపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తూ పుస్తకాలు, యూనిఫామ్లు వారు చెప్పిన దుకాణాలలోనే కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తేవడం సరైనది కాదని అన్నారు. ప్రతి ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను నిరుపేదలకు ఉచితంగా కేటాయించాలని అన్నారు. విద్యార్థుల సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని, అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ధూమపానం కేన్సర్కు దారి

ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ

తణుకు : ధూమపానం వల్ల శరీరంలో కీలక అవయవాలు పాడవ్వడంతో పాటు కేన్సర్ వ్యాధికి కారణమవుతుందని తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్.వెలగల అరుణ అన్నారు. మే 31వ తేదీన ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినంలో భాగంగా ఈనెల 21వ తేది వరకూ ధూమపానంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం స్థానిక ఆసుపత్రి ఆవరణలో పొగాకు పరిశ్రమ జోక్యం నుంచి పిల్లలను రక్షించడం అనే నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అరవై లక్షల మంది పొగాకు వాడకం ద్వారా చనిపోతున్నారని, మన దేశంలో పది లక్షల మంది ఈ దుర అలవాట్ల వల్ల చనిపోతున్నారన్నారు. ప్రపంచంలో ఎక్కువ నోటి కాన్సర్ మరణాలు మన దేశంలో సంభవిస్తున్నాయన్నారు. పొగ తాగే వారికి ఎంత హానికరమో ఆ పొగను పీల్చడం ద్వారా కూడా ఇతరకులకు అంతే నష్టమన్నారు. ఈ సమావేశంలో సైకాలజిస్ట్ డాక్టర్ ఎల్ సాయిబాలాజీ, జనరల్ మెడిసిన్ డాక్టర్ కె.శారదా ప్రసన్న పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్దకు రావొద్దు

ఉండి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణంరాజు

కాళ్ల: భీమవరం ఎస్ఆర్కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్దకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రావొద్దని ఉండి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణంరాజు పిలుపునిచ్చారు. సోమవారం పెదఅమిరంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ర్యాలీలు, బాణా సంచాలు కాల్చడం చేయవద్దన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. కవ్వింపు చర్యలు చేపట్టవద్దన్నారు. ఇంట్లోనే టివి ముందు కూర్చొని ఫలితాలను వీక్షించాలని అయన విజ్ఞప్తి చేశారు.

6, 7 తేదీల్లో బస్పాస్లు ఇవ్వబడవు

తాడేపల్లిగూడెం: 2024-25 సంవత్సరం విద్యార్థులకు సంబంధించిన ఆర్టిసి బస్ పాసులు సాఫ్ట్వేర్ అప్గ్రేడ్ చేస్తున్నందున ఈనెల 6, 7 తేదీలలో బస్ పాసులు ఇవ్వబడవని తాడేపల్లిగూడెం ఆర్టిసి డిపో మేనేజర్ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కావున విద్యార్థులు గమనించి సహకరించాలని డిపో మేనేజర్ విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అంతర్జాతీయ క్రీడాకారులకు వేదిక
పిఇటి, పిడిలకు పుట్టినిల్లు

శతాబ్ది చరిత్ర ఎస్విజి జెడ్పి ఉన్నత పాఠశాల సొంతం

ఎస్విజి జెడ్పి ఉన్నత పాఠశాల..

ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ విద్య

ప్రధానోపాధ్యాయుడు చిర్ల చినసూర్యనారాయణ రెడ్డి

ప్రజాశక్తి - పెనుమంట్ర

బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో అందరికీ విద్య అందాలనే మంచి ఆశయంతో గ్రామీణ ప్రాంతంలో 1920లో ఏర్పాటు చేసిన పాఠశాల, వేలాది మందికి విద్యా బుద్ధులు నేర్పడంతో పాటు, వందలాది మంది బాస్కెట్ బాల్ క్రీడాకారుల్ని తీర్చిదిద్దిందని మార్టేరు(నెగ్గిపూడి) ఎస్విజి జెడ్పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిర్ల చినసూర్యనారాయణ రెడ్డి అన్నారు. అప్పట్లో కొందరు పరిసర ప్రాంత ప్రముఖులు ఒక కమిటీగా ఏర్పడి ఈ పాఠశాలను ఎయిడెడ్(స్వయం ప్రతిపత్తి)తో ఏర్పాటు చేయగా తొలి, మలి కరస్పాండెంట్స్గా తోలేటి గోవిందరావు, బ్రిటిష్ ప్రభుత్వంలో ఎంఎల్ఏ అయిన ద్వారంపూడి బసివి రెడ్డి వ్యవహరించారని ఆయన వెల్లడించారు. ఈ పాఠశాల నుంచి కొన్ని వేలమంది విద్యార్థులు -చదవగా, అందులో పలువురు దేశ, విదేశాల్లో ఉద్యోగాల్లో ఉండగా, కొందరు వ్యాపారాల్లో స్థిరపడ్డారని అన్నారు.

సత్తి మాధవీ లత

ప్రభుత్వ పరంగా విద్యా శాఖలో వచ్చిన మార్పుల వల్ల 2012లో ప్రభుత్వ విద్యా శాఖలో విలీనం చేశారని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో మంచి విద్యా సంస్థగా పేరొందిన తమ పాఠశాల గతంలో 10/10 గ్రేడింగులు పొందగా, 2024 పది ఫలితాల్లో సత్తి మాధవీ లత(560) మార్కులతో ప్రథమ స్థానాన్ని పొందినట్లు అయన పేర్కొన్నారు. ఇదే పాఠశాలలో చదివిన సత్తి సుబ్బన్న రెడ్డి బాస్కెట్ బాల్ క్రీడాకారునిగా అంతర్జాతీయ ఖ్యాతి పొందగా, అథ్లెటిక్గా సత్తి గీత ఖండాంతర గుర్తింపు పొందారన్నారు. ఈ పాఠశాలలో చదివిన పలువురు పూర్వ విద్యార్థులు పిఇటిలు, పిడిలుగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి, క్రీడా ప్రగతికి కృషి చేయడం అభినందనీయమని, తాను కూడా ఈ పాఠశాల పూర్వ విద్యార్థిగా క్రీడల్లో ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో గోల్డ్ మెడల్ పొందానని ఆయన తెలిపారు.

క్రీడా ప్రాంగణం..

ప్రస్తుతం 400ల మందికి మించిన విద్యార్థులతో నడుస్తున్న ఈ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లు ఉదయం కేంద్రానికి 6 గంటలకే చేరుకోవాలి
మొబైల్ ఫోన్లు వెంట తీసుకురావొద్దు
రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య

ఉండి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, సజావుగా, పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించేందుకు లెక్కింపు కేంద్రంలో నిరంతరం నిఘా కెమెరాలు, ప్రత్యేక భద్రతా చర్యలను ఏర్పాటు చేశామని ఉండి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య ఈమేరకు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ 17 రౌండ్లలో ఉండి అసెంబ్లీ నియోజకవర్గం ఫలితం వెలువడుతుందన్నారు. ముందుగా ఆకివీడు మండలం పెదకాపవరం ఒకటో పోలింగ్ స్టేషన్ నుంచి ఓట్ల లెక్కింపు మొదలై ఆఖరు పోలింగ్ స్టేషన్ మాలవానితిప్ప పోలింగ్ బూత్ 238తో కౌంటింగ్ పూర్తవుతుందని, జూన్ 6 వరకూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావలి అమల్లో ఉంటుందని, ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏజెంట్లు, అభ్యర్థులు ఎవరైనా గొడవలు, అల్లర్లు సృష్టించాలని చూస్తే ఎవరినైనా ఉపేక్షించమని, పరిధి దాటిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వెంటనే వారిని లెక్కింపు కేంద్రం నుంచి బయటకి పంపిస్తామని, వీలైతే అరెస్టు కూడా చేస్తామన్నారు. ఉండి నియోజకవర్గంలో 238 పోలింగ్ కేంద్రాల్లో 2,24,725 మంది ఓటర్లకుగాను 1,93,783 ఓట్లు పోలయ్యాయి. 86.20 శాతం నమోదైంది, పురుష ఓటర్లు 87.80 శాతంతో 96,707 మంది ఓటు వేయగా, 84.72 శాతంతో 97,074 మంది మహిళా ఓటర్లు, ఇద్దరు ట్రాన్స్ జెండర్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే హోమ్ ఓట్లు మొత్తం 151 ఓట్లకు గాను 146 ఓట్లు పోలయ్యాయి. 1,657 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఉండి నియోజకవర్గం నుంచి 1453 ఓట్లు, ఇతర జిల్లాల ఓట్లు 204 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నాం. అసెంబ్లీ, పార్లమెంట్ సంబంధించి ఇవిఎం ఓట్ల లెక్కింపుకు భీమవరం ఎస్ఆర్కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ప్రత్యేకంగా కేటాయించిన ఓటింగ్ లెక్కింపు ప్రక్రియ కోసం ప్రతి రౌండ్లో అసెంబ్లీ, పార్లమెంటు నియోజక వర్గాల వారీగా విడివిడిగా 14 చొప్పున టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇందు కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్వైజర్, సహయ సూపర్వైజర్, ఒక మైక్రో అబ్జర్వర్స్ పర్యవేక్షణలో ఇవిఎంలలో నిక్షిప్తం అయిన ఓట్లను అభ్యర్థులు లేదా వారు ప్రతిపాదించిన ఏజెంట్స్ సమక్షంలో పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నిర్వహించడం జరుగుతుంది. 17 రౌండ్లల్లో ఫలితం ప్రకటించడం జరుగుతుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

94.56 శాతం పెన్షన్ల పంపిణీ

పెనుమంట్ర: మండలంలోని 18 గ్రామాల్లోని 8,410 మంది వృద్ధాప్య, వికలాంగ, వితంతు పెన్షన్ల లో సోమవారం నాటికి 94.56 శాతం మేరకు పంపిణీ చేసామని ఎంపిడిఒ పి.పద్మజ తెలిపారు. బ్యాంకు ఖాతాలు ఉన్న 5,802 మంది లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలకు పెన్షన్ జమ అయ్యిందన్నారు. వికలాంగులకు, ఇంటి నుంచి కదలలేని వయో వృద్ధులకు, పెరాలసిస్ వల్ల కదలలేని 2,608 మంది లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే పెన్షన్ పంపిణీ చేశారని ఆమె వెల్లడించారు. ఇంకా మిగిలిన 5.44 శాతం లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేస్తామన్నారు.

మొదటి విడత పాఠ్య పుస్తకాలు అందజేత

పెనుమంట్ర: నూతన విద్యాసంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేయడం కోసం మొదటి విడతలో 7వ తరగతి మినహా 1 నుంచి 10వ తరగతులకు చెందిన 20,906 సెట్లు పాఠ్య పుస్తకాలు వచ్చాయని స్థానిక మండల విద్యాశాఖ అధికారులు యండమూరి లక్ష్మీనారాయణ, ఉంగరాల నాగేశ్వర రావు తెలిపారు. ఈమేరకు 1 నుంచి 5 తరగతులకు 3,385, 6వ తరగతికి 1,685, 8వ తరగతికి 4,550, 9వ తరగతికి 6,149, 10వ తరగతికి 5,137 సెట్లు పుస్తకాలు వచ్చాయన్నారు. వీటితో పాటు అన్ని తరగతుల విద్యార్థులకు విద్యాశాఖ నుంచి 6,696 జతల షూలు, 2,338 బెల్టులు వచ్చాయన్నారు. రెండవ విడతలో మరిన్ని పాఠ్య పుస్తకాలు, షూ జతలు, బెల్ట్లు వస్తాయని వారు పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పెనుగొండ: మండలంలో 144 సెక్షన్ అమలు జరుగుతుందని సిఐ రజిని కుమార్ తెలిపారు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం రావడంతో సమస్యాత్మక ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి పెనుగొండ, వడలి, ములపర్రు, నడిపూడి గ్రామాల్లో ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందిని పెట్టామని, మందు కాల్పులు, ర్యాలీలు, ఊరేగింపులు అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నరసాపురం: ఫలితాల విడుదల తర్వాత, ముందు అల్లర్లకు, ఘర్షణకు దిగవద్దని నరసాపురం డిఎస్పి జి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్లో ప్రజలతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందన్నారు. ముగ్గురు కంటే ఎక్కువ మంది ఒకేచోట ఉండకూడదన్నారు. బాణాసంచా కాల్చడం, బైక్ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

తణుకు: సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ శాఖ నిరంతర నిఘా ఉంటుందని, కవ్వింపు చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తణుకు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఓట్లు లెక్కింపు తర్వాత సోషల్ మీడియా వేదికగా మీ అంతు చూస్తామంటూ కవ్వింపు చర్యలకు పాల్పడి, సమాజంలో అశాంతి సృష్టించినా, వ్యక్తిగత ద్వేషణలకు పాల్పడుతూ ఉద్రిక్తలు సృష్టించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిపై ఐటి యాక్టు-2000 ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీ షీట్లు ఓపెన్ చేసి, పిడి యాక్టు ప్రయోగించడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మరణించిన ఉపాధి కూలీలకు ఎక్స్గ్రేషియా ఇవ్వాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పనిలో మరణించిన వారికి రూ.5 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెత్తడేపల్లి గ్రామంలో ఇటీవల ఉపాధి పని చేస్తుండగా గుండెపోటు వచ్చి మరణించిన ఆలపాటి వెంకటరావు కుటుంబ సభ్యులను ఆయన సోమవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ మండలంలో ఈ సంవత్సరం పనులు ప్రారంభం నుంచి ముగ్గురు కూలీలు చనిపోయినట్లు తెలిపారు. ఒకటి మెట్ట ఉప్పరగూడెం, రెండు మాధవరం, మూడోది పెత్తడేపల్లి గ్రామాలలో ఎండ తీవ్రత తట్టుకోలేక ఉపాధి కూలీలు చనిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మెట్ట ఉప్పరగూడెంలో పని చేస్తుండగా గుండెపోటు వచ్చింది, దీంతో ఆసుపత్రికి తరలిస్తుండగా ఆయన మార్గం మధ్యలోనే చనిపోయారన్నారు. పెత్తడేపల్లి గ్రామంలో ఆలపాటి వెంకట్రావు పనిచేస్తుండగా కుప్పకూలిపోయారని తెలిపారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు కొత్తగా వచ్చే ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'వైసిపి ఘన విజయం సాధించాలి'

పాలకొల్లు: రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ సోమవారం పాలకొల్లులోని క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయంను సందర్శించారు. ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా మంత్రిని కలిశారు. మంగళవారం జరిగే ఎన్నికల కౌంటింగ్లో వైసిపి రాష్ట్రంలో ఘన విజయం సాధించాలని మంత్రి స్వామి వారికి పూజలు చేయించినట్లు మంత్రి అనుయాయులు తెలిపారు.

రాజకీయ పార్టీల భవితా..

పందెపురాయుళ్ల భవిష్యత్తా?

ఆకివీడు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల భవిత కన్నా అనేక మంది యువత ప్రజానీకంలో పందెపురాయుళ్ల భవిష్యత్తు పైనే ఎక్కువ ఆసక్తి కనిపిస్తోంది. పార్టీల గెలుపోటములపై ఇప్పటికే అనేకమంది రకరకాలుగా పందేలు కాశారు. ఈ పందేల కోసం సాధారణ ప్రజానీకం సైతం ఒళ్లుగుల్ల చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఎంత కష్టపడితే మాత్రం ఎంత సంపాదిస్తాం. ఒక్క పందెం కొడితే చాలు అంటూ ఎక్కడెక్కడో డబ్బులు తెచ్చి పందేలులో పెట్టారు. దాచుకున్న డబ్బులే కాకుండా ఈ రెండు నెలల నుంచి కష్టపడిన డబ్బులతో పాటు అప్పు చేసి మరీ పందేలు కాశారు. అరెకరం, ఎకరం ఉన్న చిన్న చిన్న రైతులు పందేల పిచ్చిలో పడి ఆ భూములు తాకట్టు పెట్టి మరీ పందేలు కట్టారు. ఆ రకంగా పందేలు కట్టిన వాళ్ల రాత్రి, పగలు నిద్ర లేకుండా కూర్చున్నారు. నాలుగో తారీఖు సాయంత్రం ఎప్పుడు వస్తుందా ఎప్పుడు పందెం గెలుస్తామా అంటూ ఎదురు చూస్తున్నారు. అదృష్టం అనుకూలిస్తే పర్వాలేదు, తిరగబడితేనే అసలు సమస్య మొదలవుతుంది. ఒక మహానుభావుడు అయితే రెండు నెలల పాటు చేయబోయే కూలీ పనికి ముందస్తు పందెం కట్టాడు. మరొక యువకుడు నెలరోజుల పాటు చేపల చెరువుపైన కాపలాకాసేందుకు పందెం కట్టాడు. ఇవి చిన్నవే. మరికొందరు పొలాలు, భూములు తాకట్టు పెట్టి సైతం పందేలు కట్టారు. లక్ష రూపాయలు పందెం కాస్తే మూడు లక్షల వస్తాయంటూ ఒక యువకుడు భార్య మెడలో పుస్తెల గొలుసు తాకట్టు పెట్టి మరీ పందెం కాశాడు. ఇటువంటి పందాలన్నిటికీ ఫలితాలు తేలేది నేడే. అయితే గెలుపు, ఓటమి రెండిటిలోనూ నష్టపోయేది సామాన్యులు ఎక్కువ మంది ఉన్నారు.

జోరుగా పందేలు : ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలు కొన్ని గంటల్లో వెలువడడంతో బెట్టింగ్ రాయళ్లలో తీవ్ర ఉత్కంటం నెలకొంది. ఆచంట నియోజవర్గంలో రాజకీయ నాయకులతో పాటు ఆయా సామాజిక వర్గాలకు చెందిన పెద్దలు రాష్ట్రంలో టిడిపి అధికారంలోకొస్తుందని లేదు వైసిపి అధికారంలోకి వస్తుందని లక్షల రూపాయలతో పందేలు కాస్తున్నారు. నియోజవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విజయం సాధిస్తారని, వైసిపి నుంచి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు గెలుపు ఖాయమని బెట్టింగ్లు కాస్తున్నట్లు సమాచారం. అభ్యర్థులు ఓడిపోతారో గెలుస్తారో అన్న టెన్షన్తో బెట్టింగ్ రాయుళ్లు ఉన్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తుందని, చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని కొందరు. లేదు వైసిపి అధికారంలోకి వస్తుంది జగన్ సీఎం అవుతారని మరికొందరు ఇప్పటికే పందేలు కాశారు. ఎవరు గెలుస్తారో వేచి చూడాలి.

ముగిసిన జాతీయస్థాయి నాటకోత్సవాలు

భీమవరం టౌన్: భీమవరం డిఎన్ఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో జరుగుతున్న చైతన్య భారతి 17వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఘనంగా ఆదివారం రాత్రి ముగిశాయి. అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'ఇంద్ర ప్రస్థం' నాటిక ఉత్తమ ప్రదర్శన, తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' ద్వితీయ స్థానం, చైతన్య కళా భారతి కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం' నాటికలు తృతీయ ప్రదర్శన సాధించాయని చైతన్య భారతి అధ్యక్షులు రాయప్రోలు భగవాన్ తెలిపారు. జ్యూరీ ప్రదర్శనగా కళాంజలి హైదరాబాద్ వారి 'రైతే రాజు', ఉత్తమ రచన మూల్యం రచయిత సింహ ప్రసాద్, ఉత్తమ దర్శకత్వం ఎన్.రవీంద్ర రెడ్డి, ఉత్తమ నటుడు కుమార్ పాత్రధారి సి.వరప్రసాద్(నిశ్శబ్దమా నీ ఖరీదెంత), ఉత్తమ నటి చుక్కమ్మ పాత్రధారిణి నాగరాణి(విముక్తి), ఉత్తమ ప్రతి నాయకురాలు పాత్రధారి సరిత (ఎనిమి), ఉత్తమ హాస్యనటుడు వి.సురేష్(ఎనిమి), ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కె.సూర్యనారాయణ(స్వప్నం రాల్చిన అమృతం), ఉత్తమ క్యారెక్టర్ నటి వసంత యామిని (మనస్విని), సంగీతం (ఇంద్ర ప్రస్థం), ఉత్తమ మేకప్ మనస్విని, ఉత్తమ లైటింగ్ కౌసల్య సుప్రజ రామా, జ్యూరి బహుమతి శ్రావ్య, కావ్య(ఎనిమి), సాయి, సుప్రియ (స్వప్నం రాల్చిన అమృతం) అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయప్రోలు శ్రీనివాస మూర్తి, బొండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణ వర్మ పాల్గొన్నారు.

ఎన్టిఆర్ జిఇఎన్టి స్కాలర్షిప్ గడువు పెంపు

పెనుమంట్ర: ఇంటర్ విద్యార్హతతో విద్యార్థినులు ఎన్టిఆర్ ట్రస్ట్ నిర్వహించే ఎన్టిఆర్ జిఇఎన్టి (గర్ల్స్ ఎడ్యుకేషన్ స్కాలర్షిప్) స్కాలర్ షిప్-2024కు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 7వ తేదీ ఆఖరు తేదీ అని ట్రస్ట్ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెస్ట్లో పాల్గొని, విజేతలు అయిన మొదటి పది ర్యాంకులు పొందిన వారికి నెలకు రూ.5 వేలు, తర్వాతి 15 ర్యాంకులు పొందినవారికి నెలకు రూ.3 వేల చొప్పున ఎన్టిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసే వరకు ఇవ్వనున్నారని తెలిపారు. అలాగే క్యాట్, సివిల్ సర్వీస్ ఎగ్జామ్లకు ఉచితంగా శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. నోటిఫికేషన్కు చెందిన వివరాలు, దరఖాస్తు చేసుకొనే విధానం ట్రస్ట్ లింక్ ద్వారా https://www.apteachers9.com/2024/05/ntr-trust-ntr-geent-girls-education.html?mR1 పొందాలని వారు తెలిపారు.

'టిడిపి కూటమి విజయం సాధించాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి, జనసేన అభ్యర్థులు విజయం సాధించాలని కోరుతూ టిడిపి, జనసేన నాయకులు బండి ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో టిడిపి నాయకులు మంగళవారం వెలువడే ఎన్నికల ఫలితాల్లో టిడిపి, జనసేన అభ్యర్థులు అత్యధిక శాతం విజయం సాధించి రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు నాగిడి రాంబాబు, బంధన నరసింహ స్వామి, అడ్డల ఏడుకొండలు, కొల్లాటి బాలకృష్ణ, మూలస్వామి, పెంటయ్య ఉన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 85/2020
బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం ...వాది
అండ్
D-1: వేముల బాల ఫణి
D-2: వేముల అశ్వనికుమార్
-ప్రతివాది/ ప్రతివాదులు
సమన్స్ టు:
D-1: వేముల బాల ఫణి, S/o. ఎర్రయ్య, డోర్ నెం. 4-125, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా 534268.
మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ది. 18-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించబడును.
మోచర్ల సత్యకృష్ణ
అడ్వకేట్, 3-4-10, జంపావారి వీధి
నరసాపురం-534275,
నరసాపురం ప॥గో॥జిల్లా
తేది:03-5-24 ఫోన్: 08814-274628

దస్తావేజులు పోయినవి
ఏలూరు జిల్లా, నూజివీడు టౌన్లోని కుమ్మరిపేటలో గల ఇనగంటి నాగేశ్వరరావు అను నా దస్తావేజులు మా ఇంటి వద్ద నుండి టౌన్లో ఉన్న జిరాక్స్ సెంటర్కు వెళుతుండగా మార్గం మధ్యలో ఒరిజినల్ దస్తావేజులు, నకలు కూడా పోయినవి. దస్తావేజులు నంబర్స్ 4574/2013 (9, 10, 11, 12), 4575/2013 (13, 14, 15, 16, 17, 19). కావున దయచేసి దొరికినవారు ఈక్రింది అడ్రస్కు అందజేయగలరు.
ఇనగంటి నాగేశ్వరరావు
నూజివీడు, కుమ్మరపేట, ఏలూరు జిల్లా
సెల్: 9502623254, 9010529626

పాస్పోర్టు పోయినది
పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, వల్లూరు పంచాయతి పరిధి, గెద్దాడవారిపాలెం గ్రామానికి చెందిన కోమటి సతీష్, తండ్రి: వీరస్వామికి చెందిన H8376154 నెంబర్ గల పాస్పోర్టు గెద్దాడవారిపాలెం నుంచి మోటార్ సైకిల్పై పాస్పోర్టు రెన్యువల్ జిరాక్స్ నిమిత్తం ఆచంట వెళ్తుండగా ది. 20-05-2024వ తేదీన ఒరిజినల్ పాస్పోర్టు కలిగి ఉన్న కవరు మార్గమధ్యలో పడిపోయినది. కావున నా పాస్పోర్టు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు సంప్రదించగలరు.
అడ్రస్: కోమటి సతీష్
తండ్రి: వీరస్వామి, ఇంటి నెంబర్: 7-17
వల్లూరు పంచాయతి పరిధి, గెద్దాడవారిపాలెం
ఆచంట మండలం, పశ్చిమగోదావరి జిల్లా
పిన్ కోడ్: 534269, సెల్: 7995601880

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT
AT:HYDERABAD.
O.S.No.2374 of 2022
Between:
Union Bank of India, [A Govt. of India undertaking]
[formerly] Andhra Bank Credit card Division
rep. by, Senior Manager,
Head Office, Koti, Sultan Bazar,
Hyderabad. ...Plaintiff.
And
Mr.Dharmarao Bhagawan,
S/o Mr. Bhagwan, Aged48yrs,
Occ: Private. Bluttayagudem Mandalam,
West Godavari District-534448.
...Defendant
Whereas the above named Plaintiff has filed the above suit O.S.No 2374 of 2022 on the file of Hon'ble V Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs. 2,29,549.21 pertaining to your credit card no. 4373-7820-9270-8001. You are therefore directed to appear in person or through Advocate on 3.7.24 at 10.30a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.
[AS PER THE COURT ORDER]
M.V.Nagaraj. V.V.S.Annaram
Counsel for Plaintiffs.
H.No. 1-1-336/18,
Chikkadapalli,Hyderabad.
Cell:98496-66587

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 97/2020
బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం ...వాది
అండ్
D-1: వేముల శ్రీనివాస్
D-2: తొంటా శ్రీనివాసరావు
-ప్రతివాది/ ప్రతివాదులు
సమన్స్ టు:
D-2: తొంటా శ్రీనివాసరావు, S/o. రామారావు, డోర్ నెం. 2-11/ఎ, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా 534268.
మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ది. 18-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించబడును.
మోచర్ల సత్యకృష్ణ
అడ్వకేట్, 3-4-10, జంపావారి వీధి
నరసాపురం-534275,
నరసాపురం ప॥గో॥జిల్లా
తేది:03-5-24 ఫోన్: 08814-274628

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 111/2020
బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం ...వాది
అండ్
D-1: వేముల సుశీల
D-2: వేముల రాజేశ్వరరావు
-ప్రతివాది/ ప్రతివాదులు
సమన్స్ టు:
D-1: వేముల సుశీల, W/o. రాజేశ్వరరావు, డోర్ నెం. 4-85, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా 534268.
D-2: వేముల రాజేశ్వరరావు, S/o. వెంకటరత్నం, డోర్ నెం. 4-85, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా 534268.
మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ది. 18-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించబడును.
మోచర్ల సత్యకృష్ణ
అడ్వకేట్, 3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:03-5-24 ఫోన్: 08814-274628